
# గోరింట పంట

యార్లగడ్డ సుప్రసన్న

వాళ్లింట్లో చాయ్ తప్ప కాఫీ తాగరు. ఆవిడకు కాఫీ అంటే చచ్చే ప్రాణం. ఆవేళ అయేసరికి నాలిక పీకేస్తుంది కాబోలు. ఏదో వంకన సుమతి వాళ్ల ఫ్లాట్‌కు వచ్చేస్తుంది. ఇది అర్థం చేసుకోవడానికి సుమతికి ఎక్కువ రోజులు పట్టలేదు. ఆవిడ లేనప్పుడు ఆమె పేరు కాఫీ ఆంటీ. ఎదురుగా వుంటే మేడమీది ఆంటీ. వాళ్లు సుమతీ వాళ్ల పైఫ్లోర్‌లో వుంటారు. కొడుకు కోడలుతో వుంటుంది. వాళ్లకి యిద్దరు పిల్లలు. ఇద్దరూ వుద్యోగాలు చేస్తారు కాబట్టి వాళ్ల పిల్లల్ని చూసుకోవాలి. అందుకో సొంతమనిషి కావాలి. ఆంటీ వాళ్లకి నమ్మకమైన ఆయా. ఏభైకి కొంచెం పైబడినా యింకా వోపిక వున్న మనిషి. ఆవిడకు ఆసరా కావాలి. రెండుపూటలా భోజనం, గూడూ తోడూ కావాలి. చాలా మంది జీవితం లాంటిదే ఆవిడ జీవితం.



సుమతికి అప్పుడప్పుడు కాలక్షేపం. మధ్యాహ్నం తను కాఫీ తాగే వేళకు వస్తుంది. తగని మొహమాటస్తురాలు. వచ్చేటప్పుడు వొట్టి చేతులతో రాదు. చిన్న పూలచెండో, చిన్న కప్పులో పచ్చడో తెస్తుంది. ఏవో ఆ కబుర్లు యీ కబుర్లు చెప్పి కాఫీ తాగి వెళ్తుంది.

ఆరోజు పింగాణి సాసర్లో రుబ్బిన గోరింటాకు ముద్దతో వచ్చింది. దానిని చూడగానే సుమతికి ప్రాణం లేచివచ్చింది. నిజంగా అట్లా ఆకు రుబ్బిన గోరింట ముద్దని చూసి ఎన్నాళ్లు అయిందో? సిటీకి వచ్చాక ఆల్టాలు, మెహందీ కోన్‌లూ తప్ప నిజం గోరింటాకు పెట్టుకుని ఎన్నేళ్లు అయిందో? తెగ మురిసి పోయింది సుమతి.

''థాంక్యూ ఆంటీ... థాంక్యూ...'' అని ప్రత్యేకంగా లోపలికి ఆహ్వానించింది.

''ఫ్రిజ్‌లో పెడితే ఏమీ అవదు కదా...'' అని ఆత్రుతగా అందుకుంటూ అడిగింది సుమతి.

''ఎందుకూ... నేను యిప్పుడు నీ చేతులకు పెట్టేస్తా. గంటలో నీ అరచేతులు మందారాలు అయిపోతాయంటే నమ్ము'' అన్నది కాఫీ ఆంటీ వుత్సాహంగా.

''అయితే ఓ నిమిషం. మనిద్ద

రికీ చెరో కప్పు కాఫీ తెస్తా. ఆ తర్వాత దీని సంగతి చూద్దాం'' అన్నది సుమతి.

క్షణంలో రెండు కాఫీ కప్పులతో వచ్చేసింది. ఆంటీ కాఫీ తాగుతూ గోరింటాకు ముచ్చట్లు బోలెడు చెప్పింది. వాళ్ల వూళ్లో ఆకు రుబ్బేటప్పుడు ఏడు యిళ్ల తాటాకులు వేసేవాళ్లుట. పుట్టగొడుగులా వుండే కాకిబొడ్డు వేస్తే బాగా పండుతుందిట. కరణం గారి చెట్టు ఆకు ఫస్టుక్లాసుగా పండేదిట. కొద్దిగా నిమ్మరసం పిండితే శ్రేష్టంట.

''ఇంతకు యీ ఆకు ఎక్కడ సంపాదించారు ఆంటీ'' అని అడిగాను. రోజూ ఆకు కూరలు తెచ్చే అమ్మాయిని అడుగుతోందిట ఎప్పటినుంచో. ఆ అమ్మాయి సిటీ చివర ఎక్కడో వుంటుంది. వాక పూజ పునస్కారం లేని దేవాలయం పక్కన గోరింట పొద వుందిట. ఆ అమ్మాయి అడగ్గా అడగ్గా తెచ్చిపెట్టిందిట. కాఫీలు తాగడం పూర్తయింది.

సుమతి సందేహంగా బిక్కుబిక్కుమంటూ గడియారం వంక చూసింది. సాయంత్రం నాలుగు గంటలు అయింది. ఆంటీకి విషయం అర్థమైంది.

''చూడమ్మాయ్! అయిదు నిముషాల్లో పెట్టేస్తా. గంటలో పండిపోతుంది. మీ ఆయన వచ్చేసరికి కొత్త పెళ్లికూతురిలా ఎదురు రావచ్చు'' అని హామీ యిచ్చింది.

సుమతి సరే అన్నట్లు తల వూపింది. కొవ్వొత్తి తెప్పించి వెలిగించింది ఆంటీ. దానితో చురుక్ చురుక్‌మని అరచేతిలో కాసిని చుక్కలు వేసింది మైనంతో. రెండు అరిచేతులకూ, వేళ్లకూ గోరింటాకు పైనంగా పెట్టింది ఆంటీ. తర్వాత రెండు అరికాళ్లలో రెండు పెద్ద చక్రాలు పెట్టింది. పాదాలకు పారాణి గీతలు పామింది. సుమతికి పుట్టింటి జ్ఞాపకాలు ముసురుకున్నాయి. అట్ల తద్దెలు గుర్తుకు వచ్చాయి. మనసు ఎప్పటెప్పటి సంగతులనో తలచుకుంటుంటే, సెల్‌ఫోన్ మోగడంతో వులిక్కిపడింది సుమతి. సుమతికి ఏంచెయ్యాలో అర్థం కాలేదు. ఆంటీ తీసుకుంది ఫోను. ''ఫలానా బటన్ ప్రెస్ చేసి, మళ్లీ యిప్పుడే ఫోను చేస్తానని చెప్పు ఆంటీ'' అంది సుమతి. ఆవిడ బటన్ నొక్కి చెవిదగ్గర పెట్టుకుని ''ఎవరండీ'' అంది. అప్పటికే అవతల గొంతు ఏకధాటిగా మాట్లాడేస్తోంది. సుమతికి వినిపిస్తూనే వున్నాయి మాటలు.

''మీ ఆయన'' అని మాత్రం అంది ఆంటీ. తర్వాత యిక మాటామంచీ లేదు. గుడ్లప్పగించి, వెర్రిచూపులు చూస్తోంది పాపం.

చిన్న అపశ్రుతి దొర్లింది. అదేమంటే రోజూలాగే ఎప్పటిలాగే సుమతి ఫోన్ తీసిందనుకున్నాడు సుమతి మొగుడు. దానితో సుమ్మీ సుమ్మీ అని మామూలుగా కురిపించే అమృతం అంతా ఆంటీ చెవిలో కురిపించాడు. ఆవిడ అనుకోని యీ సంఘటనకు చాలాసేపు కోలుకోలేకపోయింది. పైకి చెప్పుకోవడానికి లేదు. ఏవిటో చింతచిగురు చిన్నచేప అన్నాడు, కోడిగుడ్డు బుడ్డిదీపం అన్నాడు... ఆంటీకి ఒక్క ముక్క అర్థం కాలేదు.

ఇంతలో అనుకున్నంతా అయింది.

చడీచప్పుడు లేకుండా వచ్చి, వుత్సాహంగా లోపలికి వస్తూ యీలపాట మొదలుపెట్టాడు సుమతి మొగుడు చక్రి. సుమతి ఆదుర్దాపడిపోతోంది. మొగుడు వస్తే ఎందుకంత కంగారుపడుతోందో ఆంటీకి అర్థంకాక అయోమయంగా చూస్తోంది.

''అట్లా ఆఫీస్ నుంచి బయలుదేరేముందు సెల్

**చిన్న అపశ్రుతి దొర్లింది. అదేమంటే రోజూలాగే ఎప్పటిలాగే సుమతి ఫోన్ తీసిందనుకున్నాడు సుమతి మొగుడు. దానితో సుమ్మీ సుమ్మీ అని మామూలుగా కురిపించే అమృతం అంతా ఆంటీ చెవిలో కురిపించాడు. ఆవిడ అనుకోని యీ సంఘటనకు చాలాసేపు కోలుకోలేకపోయింది. పైకి చెప్పుకోవడానికి లేదు. ఏవిటో చింతచిగురు చిన్నచేప అన్నాడు, కోడిగుడ్డు బుడ్డిదీపం అన్నాడు... ఆంటీకి ఒక్క ముక్క అర్థం కాలేదు.**

ఫోన్‌లో అవతల వాళ్లెవరో కూడా గ్రహించకుండా మాట్లాడేసి, యీల పాటతో ఎంటర్ అయినా... యిహ అంతే. ఈ గోరింటాకు యింకో అరగంటైనా ఆగితేగాని పండదు. ఆంటీకి యీ సంగతులు తెలియవు. తెలిసినా బావుండదు. అసలు యిందాక ఫోన్‌లో మాట్లాడిన మాటలన్నిటినీ పొడుపు కథల్లా విప్పితే, ఆంటీ మూర్ఛపోయేమాట ఖాయం'' అనుకుంది సుమతి. అసలు తను ఆఫీసు నించి వచ్చేసరికి టీవీ చూస్తుంటేనే సహించలేడు. ఎవరైనా ఆ టైములో కబుర్లు చెబుతూ కూచుంటే అసలు భరించలేడు.

''సుమతి సరదాపడితే.. గోరింటాకు పెట్టా...'' అని ఆగి ఆగి మాట్లాడుతూ చెప్పింది ఆంటీ.

ఆయనేం మాట్లాడలేదు. సీరియస్‌గా సుమతి వంక చూశాడు. బడిలో చిన్నపిల్ల బెత్తం దెబ్బల కోసం చేతులు జాచినట్టు చూసింది సుమతి. ''పది నిమిషాలు ఆగితే ఫస్ట్‌గా పండుతాయండీ'' అన్నది కళ్లని రెట్టింపు చేసి. చక్రి ఆకలిగొన్న పులిలా వున్నాడు. ఆంటీ మెల్లిగా జారుకుంది.

''నిన్నసలు యీ వేళప్పుడు గోరింటాకు పెట్టుకోమని ఎవరు చెప్పారు'' అని అరిచాడు చక్రి.

''సర్లెండి. రాత్రిపూట పెట్టుకుంటే అదొక యిబ్బందీ... ఎప్పుడూ సొంతం పండేదాకా వుండనివ్వరూ'' అని సాగదీసింది సుమతి.

''చేతులకే అనుకున్నా, పాదాలకు కూడా పెట్టించావా పాపం అట్లా పిల్లిలా నడుస్తున్నావ్'' అన్నాడు చక్రి. అంతలోనే సుమతి అనుకున్నంతా అయింది!

సుమతికి నడిచినట్లు జ్ఞాపకం లేదు. అట్లాగని పాకినట్టు గుర్తులేదు. మరి బెడ్‌రూంలో మంచంమీద ఎట్లా వచ్చిపడిందో.. రెప్పపాటులో వచ్చి పడింది.



''ఏవండీ ప్లీజ్ అండీ.. ఏవండీ...''

ఎనస్తీషియా యిచ్చేటప్పుడు అంకెలు చదివిస్తారనీ ఆరు, ఏడు, ఎనిమిది అనేసరికి అయోమయంలోకి వెళ్తారనీ చెప్పగా విన్నది సుమతి.

ఇప్పుడు దాదాపు అదే పరిస్థితి. ఎక్కడో మబ్బుల మధ్యన తేలిపోతున్నట్టు వుంది. గోరింటాకు పండితే ఎంత పండకపోతే ఎంత? అసలు చేతులకు ఆ పూతలున్నమాటే మరుగునపడిపోయింది. అసలీ నైటీలను కనిపెట్టినవాడికి దణ్ణం పెట్టాలి అనుకుంది సుమతి. చక్రి ఎప్పటి నుంచి యింటి యావతో వున్నాడో అప్పటిదాకా సుమతికి అర్థం కాలేదు. ఇప్పుడు యావ తీరి తేలికపడ్డాడు. సుమతికి ఒకసారి గుండె జల్లుమంది. చక్రి తెల్లచొక్కా ఆకుపచ్చ డిజైన్లతో కనిపించింది. '' ''అమ్మో! యిది ఎట్లా వదుల్తుందో'' అనుకుని అంతలోనే ''వదలకపోయినా వర్తీయిట్'' అనుకుంది సుమతి.

చెదిరిపోయిన గోరింటాకు చూసి ''సారీ సుమ్మీ వెరీసారీ...'' అన్నాడు చక్రి. ''సారీ ఎందుకు యిదొక గొప్ప ఎక్స్‌పీరియన్స్.. థాంక్యూ చక్రీ'' అంటూ వాష్‌బేసిన్‌లో మిగిలిన కాస్త గోరింటాకును కడిగేసింది. మైనపు చుక్కల మీద పొడలు పొడలుగా కాస్త కాస్త పండిన గుర్తులు పడ్డాయి అరిచేతులలో. ''రియల్లీ యిటీజ్ ఫైన్... భలే పండింది'' అంది విలాసంగా సుమతి. చక్రి గర్వంగా పచ్చబడిన తెల్లని చొక్కాని చూసుకున్నాడు.

## నత్త నడక

ఒక బార్‌లోకి ఒక నత్త నడుచుకుంటూ వచ్చింది. నత్తను చూసి వెయిటర్ చిరాకు పడి ''ఇక్కడ నత్తలకు మందు పోయరు'' అన్నాడు.

''ఇక్కడికి నడిచి రావడానికి నాకు ఆరు నెలలు పట్టింది. ఏమైనాసరే మందు పోయాల్సిందే'' అని డిమాండ్ చేసింది నత్త. వెయిటర్‌కి కోపమొచ్చి నత్తను ఈడ్చుకెళ్లి రోడ్డు మీద పారేశాడు.

సంవత్సరం తరువాత నత్త తిరిగొచ్చి ''ఇంతకుముందు నాకెందుకు మందు పోయనన్నావ్?'' అని గద్దించింది.

